# ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడు హఠాన్మరణం

## ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద గుండెపోటుతో కుప్పకూలిన వైనం

**శంషాబాద్, ఆగస్టు10, ప్రభాతవార్త :** శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి కొచ్చిన్ వెళ్లే క్రమంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికుడు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద ప్రక్రియ పూర్తి చేసుకుంటుండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. గుండెపోటు లేదా ఇతర అనారోగ్య కారణంతో అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్య బృందం ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటన ఘటనపై ఆర్ జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# హర్..ఘర్.. తిరంగా షురూ

## జిల్లాలో శ్రీకారం చుట్టిన బిజెపి నాయకులు

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఆగస్టు 10, ప్రభాతవార్త :** నా ఇళ్లు, నాదేశం, నా జెండా అనే నినాదంతో హర్..ఘర్..పై జాతీయ జెండాను ఎగుర వేసే కార్యక్రమాన్ని బిజెపి నాయకులు శ్రీకారం చుట్టారు. బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పిలుపు మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్ సూచనల మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో బిజెపి నాయకులు ముందుగా వారి వారి ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే సోమవారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని హకీంపేట్- సింగాయిపల్లిలో తన ఇంటిపై బిజెపి రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అదే విధంగా అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు వారి వారి ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు పిలుపు మేరకు వారి ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. బిజెపి హర్-ఘర్‌పై జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని బిజెపి నాయకులు శ్రీకారం చుట్టారు.

వారు తన ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయటం సంతోషంగా ఉందని గర్వంగా ఉందని వారు పేర్కొన్నారు. భారత పౌరుడుగా తిరంగ్ యాత్రలో భాగంగా ప్రతి ఇంటిపై బిజెపి నాయకులు,కార్యకర్తలు జాతీయ జెండాలను ఎగురవేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నివ్వటం జరిగింది. జిల్లాలోని పలు మండలాల్లో, పలు మున్సిపాల్టీల్లోనూ బిజెపి నాయకులు, కార్యకర్తలు పలువురు హర్ ఘర్ తిరంగ్ యాత్రలో భాగంగా వారి ఇళ్లపై బిజెపి జెండాలను ఎగురవేశారు.



లాల్‌గడిమలక్‌పేట్‌లో అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్..



సింగాయిపల్లిలోని తన ఇంటిపై మువన్నెల పతాకాన్ని ఎగురవేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకురాలు హైమారెడ్డి

# 2 లక్షల ఓట్లపై కత్తి





**గత మూడు విడతలుగా మున్సిపల్ ఫలితాలను, స్థానిక ఎన్నికల గెలుపోటములను శాసిస్తూ వచ్చిన దొంగ ఓట్ల సామ్రాజ్యానికి తెరపడింది. వికారాబాద్ జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ సర్వే ఓటర్ల జాబితాలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. కర్ణాటక, మహారాష్ట్ర సహా పొరుగు జిల్లాలకు చెందిన వేలాది మంది బినామీ ఓటర్లను కచ్చితమైన ఆధారాలతో తొలగించడంతో, రాబోయే ఎన్నికల సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి**

**★ వికారాబాద్ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ★ బినామీలు, ఇతర రాష్ట్రాల దొంగ ఓట్ల ఆటకట్టించిన యంత్రాంగం ★ పక్కా ఆధారాలతో ప్యాకప్ ★ ఒకే వ్యక్తికి రెండేసి చోట్ల ఓటు హక్కు రద్దు ★ తాండూరులో అత్యధికంగా 64 వేల ఓట్లపై వేటు ★ తొలగించిన వారిలో 3 వేల కర్ణాటక ఓటర్లు ★ స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావితం చూపనున్న సర్ ఎఫెక్ట్ ★ గతంలో ఫలితాలను మార్చేసిన పొరుగు రాష్ట్రాల ఓటర్లు.. ★ నెలన్నర రోజుల కసరత్తు విజయవంతం ★ కలెక్టర్ చొరవతో వేగవంతమైన ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ★ కొడంగల్‌లో 100 శాతం ప్రక్రియ పూర్తి.. ★ మిగిలిన 3 నియోజకవర్గాల్లో 99 కంటే ఎక్కువ పూర్తి చేసిన యంత్రాంగం ★ జిల్లాలో ప్రస్తుతం 8.06 లక్షల మంది క్రియాశీలక ఓటర్లు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పూర్తయిన తర్వాత జిల్లాలో 2 లక్షల ఓటర్లు తొలగించారు. దీని వల్ల ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మనిషికి ఒక్క ఓటు హక్కు ఉండేలా చేశారు. ఒకటికి మించి అదనంగా నమోదు చేసుకున్న ఓట్లను తొలగించి జాబితాను సవరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కొడంగల్ నియోజకవర్గంలో 100 శాతం పూర్తయింది. మిగిలిన మూడు నియోజకవర్గాలలో 99.08 నుంచి 99.99 శాతం వరకు పూర్తి చేశారు. జిల్లాలో స్థానికేతరుల ఓట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణ, ఏపీలోని ఇతర జిల్లాల వారే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర వాసులు జిల్లాలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల ఓటర్ల కారణంగా గత మూడు దఫాలుగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఫలితాలపై ప్రభావం చూపెట్టింది. కర్ణాటక ప్రాంతానికి చెందినవారు సుమారు 3 వేల మంది ఓటర్లు తాండూరు మున్సిపల్ పరిధిలో బినామీ అడ్రెస్‌లతో ఓటు నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఎస్ఐఆర్ ద్వారా వారి పేర్లన్నీ తొలగించారు.

జిల్లాలో నెలన్నర రోజులుగా ఎస్ఐఆర్ కార్యక్రమం జరిగింది. ఆరంభంలో నత్తనడకన సాగినా చివర్లో వేగమంతంగా చేపట్టారు. దరఖాస్తులను అందజేసేందుకు గడువును రెండుసార్లు పొడగించారు. ప్రభుత్వ పథకాలకు అనర్హత వేటు పడుతుందనే ప్రచారం జరిగింది. జనం ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ఎగబడ్డారు. ఇంటింటీ సర్వే, ఎన్యూమరేషన్, డిజిటలైజేషన్ చేపట్టారు. గడువు ముగిసే నాటికి జిల్లాలో 10,17,671 మంది ఓటర్ల దరఖాస్తులను పరిశీలించారు. అందులోంచి 2,07,880 మంది ఓటర్లు ఎలాంటి దరఖాస్తు ఫారాలను పూర్తి చేయలేదు. వారందరికీ మరోచోట ఓటు హక్కు ఉన్నందున కేవలం ఒకే చోట నమోదు చేశారు. దానివల్ల 2 లక్షల ఓటర్లను తొలగించారు. ప్రస్తుతం 8,06,948 మంది క్రియాశీలక ఓటర్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కలెక్టర్ దీపక్ తివారీ ప్రత్యేక చొరవ కారణంగా జిల్లా అధికార యంత్రాంగం, కిందిస్థాయి అధికారులు, బీఎల్‌వోలు సమర్థవంతంగా పని చేయడం వల్ల లక్ష్య సాధన దిశగా ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగింది. ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా సహకారం అందించారు.

2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రక్రియ చేపట్టారు. మరణించిన ఓటర్లను, చిరునామా మారిన వారు, ఇతర ప్రాంతాల వారు, అందుబాటులో లేనివారిని గుర్తించారు. ఎస్ఐఆర్ గడువు పూర్తయిన తర్వాత జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో క్రియాశీలకంగా ఉన్న ఓటర్ల సంఖ్య 8,06,348 ఉన్నట్లు తేల్చారు. అత్యధికంగా తాం దూరు నియోజకవర్గంలో 64,413 ఓట్లను తొలగించగా ప్రస్తుతం 1,86,417 ఓటర్లు ఉన్నారు. కొడంగల్‌లో 39940 ఓట్లను తొలగించగా 2,11,315 ఓట్లు క్రియాశీలకంగా ఉన్నాయి. పరిగిలో 52,867 మందిని తొలగించగా 2,23,357 మంది క్రియాశీలకంగా ఉన్నట్లు తేల్చారు. వికారాబాద్‌లో 50,469 మందిని తొలగించగా 1,85,259 మంది క్రియాశీలకంగా ఉన్నట్లు ఎస్ఐఆర్‌లో గుర్తించారు.

# రెండుసార్లు గడువు పెంచినా మందకోడే!





## డిజిటలైజేషన్ పూర్తయింది 63.92 శాతమే.. 1,247 మంది ఓటర్ల గల్లంతు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సోమవారంతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగిసింది. ఈ ప్రక్రియ వివరాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారికంగా విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5 అసెంబ్లీ నియోజకవర్గాలు (మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ తదితరాలు) పరిధిలోని 2,435 పోలింగ్ బూత్‌లలో మొత్తం 29,79,130 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఇప్పటివరకు ముగిసిన సర్ ప్రక్రియ ప్రకారం 19,04,176 మంది (63.92 శాతం) మాత్రమే ఎన్యుమరేషన్ పత్రాలను సమర్పించి, తమ వివరాల డిజిటలైజేషన్‌ను పూర్తి చేసుకున్నారు. ఇక జిల్లాలోని 10,73,705 మంది ఓటర్లు బిఎల్‌ఓలు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ పత్రాలను తిరిగి అందజేయకపోవడంతో వారి వివరాల డిజిటలైజేషన్ నిలిచిపోయింది. దీంతో వీరు అసలు ఓటరుగా ఉన్నట్లా.. లేనట్లా? అనే అంశంపై తీవ్ర అనిశ్చితి, సందిగ్ధత నెలకొంది.

**కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించినా..**

ఈసీ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించినప్పటికీ నమోదు మందకొడిగానే సాగింది. ఈ ప్రక్రియ కోసం ఈసీ ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. చివరి వారంలో కేవలం 2 నుంచి 3 శాతం మేర మాత్రమే డిజిటలైజేషన్ నమోదు పెరిగింది. మరోవైపు, పత్రాలు సమర్పించినవి మరియు స్వీకరించని వివరాలు కలిపి మొత్తం 29,77,583 (99.96 శాతం) లెక్కల్లోకి రాగా, మరో 1,247 మంది (0.04 శాతం) ఓటర్ల జాడ తెలియకుండా పోయిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తులు దాఖలు చేయని ఆ 10.73 లక్షల మంది ఓటర్ల నమోదును అధికారులు ముమ్మందు ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.





బోనాల జాతరలో అశేష భక్తజనం మధ్య అంబారీపై ఊరేగుతున్న అమ్మవారు

# ర్యాగింగ్ పేరుతో అమానుషం

**♦ కర్రలు, ప్లేట్లతో కొట్టి.. బూట్లతో ముఖంపై తొక్కిన తోటి విద్యార్థులు ♦ బాధితుడికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం ♦ దమ్మాయిగూడలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో కలకలం ♦ దురాగతాన్ని యాజమాన్యం దాచిపెడుతోందని తల్లదండ్రుల ఆరోపణ ♦ మెట్లపై నుంచి పడిపోయాడని బుకాయిస్తున్నారని ఆవేదన ♦ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు**

**జవహర్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడలోని ఓ ప్రైవేట్ స్కూల్ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. కామారెడ్డికి చెందిన ఎర్రోళ్ల కిరణ్ కుమార్, శోభ దంపతుల కుమారుడు అభిషేక్‌పై సుమారు 12 మంది విద్యార్థులు దాడి చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. రాత్రి సమయంలో కర్రలు, ప్లేట్లతో అభిషేక్‌పై దాడి చేయడంతో పాటు బూట్లతో ముఖంపై తొక్కినట్లు వారు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. అభిషేక్ మెట్లపై నుంచి కిందపడిపోయాడంటూ స్కూల్ యాజమాన్యం తమకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో వెంటనే పాఠశాలకు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చినట్లు చెప్పారు. అయితే తనపై ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారని అభిషేక్ చెప్పడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమారుడిపై దాడి చేసిన విద్యార్థులతో పాటు ఘటనను బయటకు రాకుండా దాచిపెట్టేందుకు ప్రయత్నించిన స్కూల్ యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఏసీపీ చక్రపాణి, ఎస్‌హెచ్‌ఓ సైదులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. దాడికి గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన వాస్తవాలను దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.





తన కుమారుడిపై జరిగిన దురాగతాన్ని మీడియాకు వివరిస్తున్న శోభ



మోమిన్‌పేట్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ కీర్తిరామకృష్ణ, ఉపసర్పంచ్ తదితరులు

# మోమిన్‌పేట్‌లో ఉద్రిక్తత

**★ బోనాల జాతరలో పురివిప్పిన రాజకీయ వైషమ్యాలు ★ 20మందికి మద్యం తాగించి తనను హతమార్చేందుకు కుట్ర పన్నారని సర్పంచ్ ఆరోపణ ★ ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు ★ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**మోమిన్ పేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామంలో బోనాల వేళ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. తాను ఆలయానికి బయలుదేరుతుండగా తమ రాజకీయ ప్రత్యర్థులు దాదాపు 20 మందిని వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించి, తన కుటుంబంపై దాడికి ఉసిగొల్పారని సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ ఆరోపించారు. 'వాళ్ల తాతలు గతంలో మా తాతలను చంపారని, కాబట్టి ఈ పురుగుల లాంటి వారిని ఏరిపారేస్తే గ్రామానికి మంచి జరుగుతుందని, మనల్ని అడిగే దిక్కే ఉండదంటూ' మద్యం మత్తులో ఉన్నవారిని రెచ్చగొట్టినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పట్లల ఇంద్రా రెడ్డికి గత 40 ఏళ్లుగా తాము అత్యంత సన్నిహితులమని, ప్రస్తుతం సబితా ఇంద్రా రెడ్డి కుటుంబంలో ఒకరిగా ఉంటున్నామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని ప్రత్యర్థి లక్ష్మీ మ్మనారాయణ గర్వంతో విర్రవీగుతున్నాడని సర్పంచ్ మండిపడ్డారు. గ్రామంలో జరుగుతున్న అమ్మవారి బోనాల జాతర సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, సర్పంచ్ భర్త రామకృష్ణ, బావ భుజంగం ఊరేగింపుగా బయలుదేరిన సమయంలో వారిని అడ్డుకుని, అవసరమైతే ప్రాణాలు తీయాలని ప్రత్యర్థులు ప్లాన్ చేశారని సమాచారం అందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్పంచ్‌గా గ్రామంలో జరిగే అక్రమ ఎర్రమట్టి తవ్వకాలు, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పోలీసులు, స్థానిక మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇది తీవ్ర విచారకరమని సర్పంచ్ స్పష్టం చేశారు. బోనాల జాతరలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, తమ ప్రాణాలకు హాని తలపెట్టాలని చూస్తున్న వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కీర్తి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, డీఎస్పీ అంజయ్యలతో పాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, గ్రామ మహిళలు మరియు బాధితులు పాల్గొన్నారు.

# అంబారీ ఎక్కిన అమ్మలగన్నయమ్మ

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఆషాఢ మాస అమ్మవారి బోనాల జాతరలో భాగంగా చివరి ఘట్టమైన మాతేశ్వరి ఘటాల సామూహిక ఊరేగింపు సోమవారం సాయంత్రం పాతబస్తీ వీధుల్లో కన్నుల పండువగా జరిగింది. ఆశేష జన సందోహం మ ధ్య ప్రధాన ఆలయాలకు చెందిన మాతేశ్వరి ఘటాలు ఒక్కొక్కటిగా బయలు దేరి సామూహిక ఊరేగింపుగా మారాయి. హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం వద్ద నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించా రు. అక్కడి నుండి భారత మాత, రాణా ప్రతాప్, భగత్ సింగ్‌ల తోపాటు దేవతామూర్తుల వేషధారణలు, బ్యాండు వాయిద్యంతో భారీ ఊరేగింపు ప్రారంభ మైయ్యింది. దారి పొడవున ఏనుగుపై గల అమ్మవారికి భక్తులు ప్రణమిల్లారు. అంబారీపై అమ్మను దర్శించు కునేందుకు రాష్ట్ర నలుమూల నుండి, నగరంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బేలా ము త్యాలమ్మ దేవాలయం, కోవ బేలా శ్రీ బంగారు మైసమ్మ దేవా లయం, సుల్తాన్ షాహి శ్రీ జగ దాం బ దేవాలయం, గౌలిపురా కోటమైసమ్మ దేవాలయం, గౌలిపు రా నల్లపోచమ్మ దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయం, రాం బక్షిబండ బంగారు మైసమ్మ దేవాలయం, అలియాబాద్ దర్బార్ మైసమ్మ దేవాలయం, మేకలబండ శ్రీ నల్లపోచమ్మ దేవాలయాల మాతేశ్వరి ఘటాల ఒకదాని వెనుక ఒకటి రాగా చివరణ శ్రీ లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయ మాతేశ్వరి ఘటం నిలిచింది. ప్రధాన ఊరేగింపు నాగులచింత చౌరస్తా, హిమ్మత్‌పురా చౌరస్తా, పంచమొహల్లా, చార్మినార్ మీదుగా సాగింది. ప్రత్యేక వేదికల నుండి పలువురు ప్రముఖులు కొబ్బరి కాయలు, పూలతో స్వాగతం పలికారు. ఆయా ఆలయాల శకటాలతో కళాకారుల ప్రదర్శనలు, వేషధారణలు, శకటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అదే విధంగా అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల పై రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కళాకారులు, వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేకంగా రప్పించిన కళా బృందాల ప్రదర్శనలు అలరిం చాయి. జలమండలి లాల్‌దర్వాజా, నాగులచింత చౌరస్తా, హరి బౌలి చౌరస్తాలలో మంచినీటి శిబిరాలను ఏర్పాటు చేసి భక్తులకు మంచినీటి సాచెట్లను అందజేశారు. డిజిఎం అబ్దుల్ హకీం, మేనేజర్లు రమేష్, నజీర్ అహ్మద్‌ల పర్యవేక్షణలో ఉద్యోగులు రవిందర్, సర్వేశ్వర్‌రావు, మహ్మద్ సలీమ్, రాజేంద్ర, కేశవరావు, భవ్య, గణేష్, సరోజలు భక్తులకు సేవలందించారు. అదేవిధంగా నిరంతరం వి ద్యుత్ సరఫరాతోపాటు ప్రధాన ఊరేగింపు మార్గాలలో, ఆలయాల వద్ద విద్యుత్ సమస్యలు లేకుండా టీజీఎస్ పీడీసీ ఎల్ ఎస్ఇ శ్రీధర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

## గజరాజు అడుగుల్లో పరవశించిన నగరం!

### భక్తజన నీరాజనాల నడుమ కన్నులపండువగా మాతేశ్వరి ఘటోత్సవం!

# రాష్ట్రానికి వరద కాటు ఖాయం!

## ఆచారం వీడితే అనార్థాలు తప్పవు - రంగంలో అనురాధ

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కుండపోత వానలు కురుస్తాయని, కొన్ని ప్రాంతాలు వరదలతో మునిగి పోతాయని మాతంగి అనురాధ తన భవిష్యవాణి వినిపించారు. సోమవారం పాతబస్తీలోని ఉప్పుగూడు శ్రీ మహంకాళి దేవాలయం, హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం, లాల్ దర్వాజా శ్రీ సింహవా హిణి మహంకాళి దేవాలయాల వద్ద రంగ కార్యక్రమంలో అమ్మవార్ని పూనిన ఆమె పచ్చికుండపై నలబడి భవిష్యవాణి చెప్పారు. పాప పు ణ్యాలు తగ్గి, మూఢ నమ్మకాలు పెరిగిపోవటం వల్లే ఈ విపరీత పరిస్థి తులన్నారు. కలి పురుషుని ప్రభావం వల్ల ప్రజలు ధర్మమార్గాన్ని వీడి చెడు మార్గంలో పయనిస్తున్నారన్నారు. జరిగేది జరుగుతందని, అది తెలుసుకొని మసలుకోవాలన్నారు. అయినా తను కాపడుతుంటానని తెలిపారు. తనకు కావాల్సినట్లు పూజలు చేయటం లేదు, నాటి నుండి జరిగినట్లు జరగటం లేదని ఆవేదన చెందారు. ఆచారం వీడితే అన్ని అనార్థాలే జరుగుతాయని అన్నారు. తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించినపుడే మంచి జరుగుతుందని భవిష్యవాణిలో పేర్కొన్నారు. కాగా లాల్‌దర్వాజా ఆలయ విస్తరణకు అందరు కలిసి కట్టుగా ఉండి పనిచేస్తే సహకరిస్తానన్నారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న స్వామిదాసు

## కొండాపూర్ యంఆర్‌పిఎస్ అధ్యక్షునిగా జి.లాజర్

**పెద్దేముల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** కొండాపూర్ యంఆర్‌పిఎస్ నూతనకమిటి అధ్యక్షుడిగా జి.లాజర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమ వారం పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామంలో మండల యంఆర్‌పిఎస్ ఇంచార్జ్ స్వామిదాసు మాదిగ, మండల సభ్యులు కే.లాజర్ మాదిగ, బేడా బుడిగ జంగాల అధ్వర్యంలో యంఆర్‌పిఎస్ నూతన కమిటిని ఎన్ను కున్నారు. కొండాపూర్ యంఆర్‌పిఎస్ నూతన కమిటి అధ్యక్షులుగా జి.లాజర్ మాదిగ, అధికార ప్రతినిధిగా బి.శ్రీశైలం, ప్రధానకార్యదర్శులుగా జి.నర్సిములు, యం.వెంకటయ్య, ఉపాధ్యాక్షులుగా ఏ.అశోక్, యం. నారాయణ, కోశాధికారిగా యం.పండరి, కార్యదర్శులుగా బి.బాబు, వి. శివయ్య, వి.వెంకటయ్య, అనిల్, సహాయ కార్యదర్శులుగా జి.వెంకటయ్య, లూకాస్, యం.చిన్న పండరి, ప్రేమ్‌కుమార్, బాల్‌రాజ్, కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాస్, మండల సభ్యులుగా శ్రీశైలం, మహిపాల్, భరత్, జి.శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యంఆర్‌పిఎస్ బలోపేతానికి తమ శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని అన్నారు.

### ఇంటి స్థలం వివాదం..

## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

**ధారూర్, ఆగస్టు 10, ప్రభాత వార్త:** ఇంటి స్థలం విషయంలో జరిగిన వివాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. పొరుగువారితో జరిగిన గొడవలో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ధారూర్ మండల పరిధిలోని గడ్డమీద గంగారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డమీద గంగారం గ్రామానికి చెందిన నిర్మల భర్త 20 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. ఆమెకు ఒక కుమారుడు శాంతి కుమార్(23), ఒక కుమార్తె సంతానం ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన మల్కప్ప అనే వ్యక్తికి, నిర్మల కుటుంబానికి మధ్య గత కొద్ది రోజులుగా ఇంటిస్థలం విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా మల్కప్ప తీరు మారలేదు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన నిర్మల తన ఇంటి వద్ద ఉండగా, మల్కప్ప తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి మరోసారి గొడవకు దిగాడు.



శాంత్ కుమారు (ఫైల్)

ఈ సమయంలో తల్లికి అండగా నిలిచిన కుమారుడు శాంతి కుమార్.. మల్కప్పతో వాగ్వాదానికి దిగాడు. ఈ గొడవతో తీవ్ర మనస్థాపానికి గురైన శాంతి కుమార్, అదే రోజు రాత్రి పొలం వద్దకు వెళ్లి గుర్తు తెలియని గడ్డి మందు తాగాడు. అనంతరం ఇంటికి చేరుకుని ఏడుస్తూ.. తాను గడ్డి మందు తాగానని, చనిపోతానని తల్లికి చెప్పాడు.

దీంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని వికారాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం శాంతి కుమార్ మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లి నిర్మల కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. మృతుడి తల్లి నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్కప్ప తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సున్నం రాఘవేందర్ తెలిపారు.



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న సర్పంచ్

## రోడ్డుకు మరమత్తు పనులు

**కుల్కచర్ల, ఆగస్టు 10, ప్రభాత వార్త:** ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ ఆంజిలయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బండవెల్కిచర్ల రోడ్డుకు గుంతలమయంగా మారింది. ప్రయాణికులకు పలు మార్లు ప్రమాదాలకు గురై ఇబ్బందులు ఎర్కొన్నారు. ఆర్‌ఎన్‌బి అధికారులు స్పందించక స్థానిక సర్పంచ్ ఆంజిలయ్య నిధులతో గుంతలు పుడ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజిలయ్య మాట్లాడుతూ...కుల్కచర్ల మండల కేంద్రంతో పాటు ఆయ గ్రామాలకురోడ్లు గుంతలమాయంగా మారాయని అధికారులు స్పందించి రోడ్లు మరమత్తులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ్‌కుమార్, వార్డు సభ్యులు ఉదయ్ రాజుపాల్గొన్నారు.

### చేగూర్ పిఎసిఎస్ చైర్మన్ పసుల బుచ్చయ్యకు ఘన సన్మానం



**నందిగామ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** చేగూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నూతనంగా నియమితులైన పసుల బుచ్చయ్యను సోమవారం ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీలు మంచన్ పల్లి ప్రియాంక శివశంకర్ గౌడ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పసుల బుచ్చయ్యను సత్కరించి, పిఎసిఎస్‌ద్వారా రైతు లకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షి ంచారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేగూర్ వార్డు సభ్యుడు ఎం. భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

## యువత ధర్మం, శాంతిని అలవరచుకోవాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** బుద్ధుని ధమ్మం నుంచి యువకులు స్ఫూర్తిని పొంది గ్రామా గ్రామాన అజ్ఞానం వీడి జ్ఞానం వైపు నడవాలని అన్నోజీగూడ కపిలవస్తు బుద్ధ విహార్ ట్రస్ట్ సభ్యులు ఆనందరావు కిష్ట దుర్గే పిలుపునిచ్చారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలు తీసుకెళ్లడానికి ఘట్‌కేసర్‌లో 278వవారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆనందరావు కిష్ట దుర్గే విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆనందరావు మట్లాడుతూ బుద్ధుని ధమ్మం మనిషిని సత్యం, కరుణ, శాంతి మార్గంలో నడిపిస్తుందని, కోపం, ద్వేషం, అహంకారాన్ని విడిచి, సమస్త జీవుల పట్ల దయతో జీవించడమే ధమ్మం అని పేర్కొన్నారు. సిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పండుగ సాయన్న జయంతి సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ పాలమూరు ప్రజాబంధు - పండుగ సాయన్న, పండుగ సాయన్న ముధిరాజ్ జీవిత చరిత్రను తెలియజేసారు. నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే జనం లో నిల్చిపోతావు అని అంబేద్కర్ మాటలు గుర్తు చేస్తూ తృప్తి సూక్తిగా చేప్పారు. అనంతర భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాస్, బండారి రాందాస్, ఎం.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో బిఆర్ఎస్ మరింత బలోపేతం

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రుస్తుం, నర్సింలు, లింగం, చందు, రమేష్, శివ, నందు, ప్రసాద్, ఆకాష్, వినయ్, రాకీ, హరీష్, నరేష్, చింటూ, యశ్వంత్, శ్రీకాంత్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ లో చేరారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు ఈ చేరికలే నిదర్శనమని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని నూతనంగా చేరిన నాయకులు పేర్కొన్నారు. దీంతో అయ్యవారిపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

**కాంగ్రెస్ నుంచి వెళ్ళింది ఒక్కరే**

గ్రామం మొత్తం మీద ఒక్కడు పార్టీ మారితే ఊరే తమ వెంట నడిచి నట్లుగా బిల్డప్పులు ఇస్తూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న హడావిడి చేయ డం విడ్డూరంగా ఉందని అయ్యవారిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్ సింహారెడ్డి అన్నారు. గ్రామం మొత్తం మీద ఒక్క నర్సింహులు అనే వ్యక్తి మాత్రమే కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాడని, కానీ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శివ తమ పార్టీకి చెందిన కార్యకర్తలందరినీ కాంగ్రెస్ పార్టీని వీడి వచ్చినట్లుగా ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు.

**ఆత్మపరిశీలన చేసుకోవాలి..**

అయ్యవారిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్ సింహారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివ ఘాటుగా స్పందిం చారు. ఒక్కరు పార్టీ మారితే ఊరంతా కదిలినట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించడం హాస్యాస్పదమని అన్నారు. ముందుగా కాంగ్రెస్ పార్టీలోకి ఇటీవల ఎవరు వచ్చారు? గతంలో ఏ పార్టీ నుంచి ఎంతమంది వచ్చారు? ఇప్పుడు ఎవరు ఎక్కడ ఉన్నారు? అనే విషయాలపై కాంగ్రెస్ నాయకులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

# వార్డు సభ్యులు శివకు కన్నీటి వీడ్కోలు

**యాచారం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు పోలే శివ ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు దుర్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతి గురి చేసింది. సోమ వారం స్వగ్రామంలో అంతక్రియలకు సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. శివ మరణం కేవలం చిన్న రోడ్డు ప్రమాదంతో దుర్మాణం చెందడం గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి.

శివ సిపిఎంలో క్రియాశీలగా పనిచేస్తూ వార్డ్ సభ్యులుగా విశేష సేవలందించి గ్రామస్తుల మన్ననలు చూరగొ న్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఉద్యమస్ఫూర్తితో అభ్యుదయ భావంతో ముందుకు నడిచే శివ అకాల మరణం గ్రామానికి తీరని లోటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడసారి వీడ్కోలు పలకటానికి చిన్న పెద్ద తేడా లేకుండా ఊరంతా కదలి వచ్చింది. వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు సిపిఎం రాష్ట్ర నాయకులు అంతిమయాత్రకు పాల్గొనటానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.



జనసంద్రంలా మారిన శివ అంతిమయాత్ర



విశ్వంను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

## మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వంకు సత్కారం

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుకల్లో షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని అగ్గనూరు విశ్వంను శాలువాతో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, 24 వార్డు కౌన్సిలర్ అగ్గనూర్ విశాల విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, గిరిజన ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్ బాలరాజు గౌడ్,, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, రఘుమా రెడ్డి ,గోపాల్, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, చందు లాల్, జాంగారి రవి, కత్తి చంద్రశేఖరప్ప, తంగడపల్లి శంకర్, వీరశం, సాయి కుమార్, అగ్గనూర్ నందు, ,జయప్రకాష్, జై హింద్ రెడ్డి, మధువులు యాదవ్, అగ్గనూర్ రవితేజ, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు. అగ్గనూర్ విశ్వంను మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, శ్రీనివాస్ యాదవ్, రఘుమారెడ్డి, సర్వర్ పాషా, నవీన్ కుమార్ అగ్గనూర్ రవితేజ వెంకట్ సాయి, విష్ణు మిల్క్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎదులాబాద్‌లో

## విశ్వశాంతి యాగం

**ఘట్‌కేసర్, ఆగష్టు 10, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఈనెల 11వ తేదీన విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వహక కర్త కంట్లం గౌరీశంకర్ తెలిపారు. ప్రతి నెలా మాస శివరాత్రి రోజున ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కల్యాణ మండపంలో విశ్వశాంతి యాగము జరుగుతుందని చెప్పారు. లోకకళ్యాణం, ప్రకృతి సమతుల్యత, మానవాళి శ్రేయస్సు (సకల జీవరాశుల క్షేమం) కోసం మంగళవారం ఉదయం నిర్వహించే పవిత్ర యజ్ఞాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించాలని గౌరీశంకర్ కోరారు. దాతలు మందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటానికి ప్రణాళిక

**పెద్దేముల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన యు.రమేష్ కుమార్ సోమ వారం హైద్రాబాద్‌లోని రాష్ట్ర బిజెపి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా యు.రమేష్ కుమార్‌కు రాష్ట్ర నాయకత్వం అభినందనలు తెలిపారు. సమావేశంలో వికారాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ ముఖ్య నాయకులు పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. సమా వేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతమే ధ్యేయమని, జిల్లాలో బిజెపిని మరింత క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళేందుకు ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేందుకు ప్రణాళిక బద్దంగా ముందుకు సాగాలని సూచిం చారు. సమిష్టి కృషితో విజయాలు సాధ్యమవుతాయని, జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాలైన పరిగి, వికారాబాద్, తాండూరులో పార్టీ శ్రేణు లకు సమన్వయం చేసుకుంటు అందరి భాగస్వామ్యంతో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషిచేస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు, మాధవరెడ్డి, శివరాజ్, గిరమోని శ్రీనివాస్, శంకర్ నాయక్, సాహుశ్రీలత, శ్రీధర్‌రెడ్డి, విబి రెడ్డి, మారుతి, కిరణ్, మిట్ట పరమేశ్వర్, వడ్ల నందు, ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, బాలేశం, విజయక్రిష్ణ ముదిరాజ్, భద్రేశ్వర్, కేశవులు యాదవ్, నాగారం మల్లేశం, శిరీష, రాజేందర్‌రెడ్డి, వివేకనందారెడ్డి తది తరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షులు రమేష్ కుమార్



ఎదులాబాద్‌లో జాతీయ జెండావిష్కరణలో పాల్గొన్న బిజెపి నాయకులు

## 'హర్ ఘర్ తిరంగా'

**ఘట్‌కేసర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో సోమవారం బిజెపి నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపుతో రాష్ట్ర, జిల్లా పార్టీ సూచన మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బిజెపి ఘట్‌కేసర్ మండల కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు బస్వ రాజుగౌడ్ ఎదులాబాద్‌లోని బిసికాలనీలో జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు బస్వ రాజుగౌడ్ మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర సమర యోధుల త్యాగాలతో సాధించుకున్న స్వతంత్ర భారతంలో ప్రతి ఒక్క పౌరుడు దేశ సమైక్యతకు పాటుపడాలని వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి నింపేందుకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, ఎదుగని శ్రీరాములు, సీనియర్ నాయకులు గుండ్ల బాలరాజ్, దళిత మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ కరుణాకర్, జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, బీజేవైఎం జిల్లాకార్యదర్శి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పోలు భాస్కర్ గౌడ్, గోలిరి మన్యం, ఉపాధ్యక్షులు పాముకుంట్ల బాలరాజ్‌గౌడ్, కృష్ణ యాదవ్, కార్యదర్శి చింతకింది సుధాకర్, మాజీ సర్పంచ్ బట్టె శంకర్, జిల్లా రజక కో కన్వీనర్ బండిరాల సాయిరాం, కొర్రెమల శక్తి కేంద్రం ఇంచార్జ్ బైనగారి సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు ఎర్రోళ్ల మురళి, మేకల శంకర్ ముదిరాజ్, ఎర్ర యాదగిరి, బాదని రాములు, కొమిరిశెట్టి నాగు, ఇటికాల శ్రీధర్‌చారి, గనుమల్ల పవన్‌కళ్యాణ్, నాయకులు పోలు నర్సింగ్‌గౌడ్, కొమిరిశెట్టి శ్రావణ్‌కుమార్, విష్ణువర్ధన్, దినేష్, బిజిలి శ్రీకాంత్, సుజాత, పోలు హైమావతి, ప్రదీప్, అర్జున్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లపై జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటండి

**ఘట్‌కేసర్, ఆగష్టు 10, ప్రభాతవార్త:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ స్వగృహంపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిభావాన్ని చాటుకోవాలని బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. తిరంగా మన గర్వం, భారత్ మన సంకల్పం అంటూ పలువురు బిజెపి నాయకులు తమ ఇళ్లపై జాతీయ పతాకాలను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా సోమవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని తన స్వగృహంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఘట్‌కేసర్ డివిజన్ చందుపట్లగూడలోని తన ఇంటిపై డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని, దేశం పట్ల మనకున్న గౌరవం, ప్రేమను చాటేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఒక గొప్ప అవకాశం అని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. బలమైన, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.



ఇళ్లపై జాతీయజెండాలను ఎగురవేసిన సుదర్శన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి

# అమ్మకు బోనం.. గ్రామానికి భాగ్యం!



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

## ఘనంగా పోచమ్మ దేవత బోనాలు

**కొడంగల్, అగష్టు 10, ప్రభాతవార్త:**

ఆషాఢ మాసంను పురస్కరించుకొని మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో పోచమ్మ దేవత బోనాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తలపై బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి పోచమ్మ దేవత ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తు పంటలు బాగా పండుతు పిల్లాపాపలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

తదితరులు అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో పండుగ వాతావరణ నెలకొంది.

## ఘనంగా బోనాల వేడుకలు

**నందిగామ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సేన అధ్యక్షుడు తుప్పుడు కృష్ణ ఆధ్వర్యంలో బోనాలవేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమ్మోరు తల్లి అనుగ్రహంతో ప్రజలందరూ ఆరోగ్యంగా.. సుఖ సంతోషాలతో..ఆనందంగా.. సిరిసంపదలతో.. జీవించాలని ఆకాంక్షి స్తూ. గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ పర్వదిన



శుభాకాంక్షలు తెలిపారు.

### అమ్మోరు తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**నందిగామ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సేన అధ్యక్షుడు తుప్పుడు కృష్ణ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమ్మోరు తల్లి అనుగ్రహంతో ప్రజలందరూ ఆరోగ్యంగా.. సుఖ సంతోషాలతో..ఆనందంగా.. సిరిసంపదలతో.. జీవించాలని ఆకాంక్షి స్తూ. గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

**-గ్రామదేవతల ఆరాధన మన సంస్కృతికి ప్రతీక:**

**పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి**

**కొత్తూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త;**

కొత్తూరు మండలం, మల్లాపూర్ గ్రామంలో సోమవారం బోనాల జాతర సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి అమ్మ వారికి బోనం ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతలను కోరుకున్నారు. గ్రామ దేవతలను ప్రకృతిని శక్తి స్వరూపిణిగా, జగన్మాతగా ఆరాధించడం భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రాచీనమైన సంప్రదాయమని అన్నారు. ప్రకృతిలోని వివిధ శక్తి స్వరూపాలనే గ్రామదేవతలుగా కొలుస్తూ తరతరాలుగా భక్తులు బోనాల పండుగను వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అమ్మవారికి భక్తితో సమర్పించే నైవేద్యాన్నే బోనం అంటారని, భక్తి, సంప్రదాయం, ఆచారాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, పాడిపంటలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు. భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పిస్తూ గ్రామదేవతలను కొలవడం మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప ఆచారమని ఆమె అన్నారు.

### షాబాద్ మండలంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో హైతాబాద్, షాబాద్, మాచన్పల్లి, సీతారాంపూర్ తదితర గ్రామాల్లో సోమవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయం విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుదరువుల మధ్య పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు చల్లంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ లో బోనాలతో ఆలయానికి బయలుదేరిన మహిళలు, గ్రామస్తులు

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : తలసాని



మారేడ్‌పల్లి మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో వైష్ణవి యాదవ్, సాయి

**అడ్డగుట్ట, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి వెస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీ మైసమ్మ దేవాలయంలో జరిగిన బోనాలు, పలహార బండి ఊరేగింపులో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తలసానిని మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకురాలు చిరబోయిన వైష్ణవి యాదవ్, సాయిప్రసాద్‌లు తలసానికి జ్ఞాపికను అందజేసి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.

**మారుమ్రోగిన మారేడ్‌పల్లి . . .**

మారేడ్‌పల్లి మైసమ్మదేవాలయం నిర్వాహకులు చిరబోయిన క్రిష్ణ యాదవ్ (గొల్లకిట్టు) తిరుమల్ వంశీల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు, పలహారం బండి ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన వేడుకలను పురస్కరించుకొని పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యనప్రదర్శన, డప్పుచప్పుల్లతో మారు మ్రోగింది. వేలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అదే విధంగా పలహార బండి ఊరేగింపు ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

**మారేడ్‌పల్లి పలహార బండి ఊరేగింపులో పాల్గొన్న కోట నీలిమ**



మారేడ్‌పల్లిలో కోట నీలిమను సత్కరిస్తున్న క్రిష్ణ యాదవ్, వైష్ణవి యాదవ్

**కంటోన్మెంట్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బోనాలు, పలహార బండి ఊరేగింపులో సనత్ నగర్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, కాంగ్రెస్ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమకు ఆలయ నిర్వాహకులు క్రిష్ణ యాదవ్ (గొల్లకిట్టు), మోండా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సి.వైష్ణవి యాదవ్‌లు ఆమెకు పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## పోచమ్మ తల్లి బోనాల వేడుకల్లో అతిథులకు సన్మానాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**మూసాపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త**

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా ఫతేనగర్‌లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, శంకర్ యాదవ్, వడ్డేపల్లి రాజేశ్వర్ తదితరులు పోచమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న నాయకులు అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అధికారులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ అరాచకం: మన్నె గోవర్ధన్‌రెడ్డి**

**జూబ్లీహిల్స్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను అర్ధరాత్రి కూల్చివేయడంపై ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ నాయకుల చరిత్రను చెరిపేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. గద్దెలను కూల్చివేయగలరేమో కానీ.. ప్రజల గుండెల్లో ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి పోరాట స్ఫూర్తిని ఎవరూ చెరిపేయలేరని మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని అర్ధరాత్రి కూల్చివేతలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు.

# అమృత్‌కుమార్ కోటకు ఐపిఎ సన్మాన్ అవార్డు



తెలంగాణ, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సిఎ అమృత్‌కుమార్ కోటకు ఐపిఎ సన్మాన్ ప్రొఫిషియెన్సీ అవార్డు ప్రదానం చేస్తున్న లోకాయుక్త న్యాయమూర్తి ఎ.రాజశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త**

చార్టర్డ్ అకౌంటెన్సీ రంగంలో విశేష ప్రతిభ, వృత్తిపరమైన నైపుణ్యం, సేవలకు గుర్తింపుగా ట్యాక్స్ బార్ మాజీ అధ్యక్షుడు సిఎ అమృత్‌కుమార్ కోటకు ప్రతిష్ఠాత్మకమైన ఐపిఎ సన్మాన్ ప్రొఫిషియెన్సీ అవార్డు-2026 లభించింది. ఈ అవార్డును చార్టర్డ్ అకౌంటెంట్ విభాగంలో ఆయనకు ప్రదానం చేశారు. ఐపిఎ ఎడ్యుకేషనల్ సొసైటీ (రిజి.) ఆధ్వర్యంలో ఐపిఎ సన్మాన్ అవార్డ్స్ 2025-26 కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి తెలంగాణ లోకాయుక్త న్యాయమూర్తి ఎ.రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా అమృత్‌కుమార్ కోటకు ప్రొఫిషియెన్సీ అవార్డును అందజేశారు. వృత్తిపరమైన ప్రతిభతో పాటు సమాజానికి అందిస్తున్న సేవలు, సంబంధిత రంగంలో చేస్తున్న కృషి మరియు నిబద్ధతను గుర్తిస్తూ ఐపిఎ సన్మాన్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభను కనబరుస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులను ఈ అవార్డుల ద్వారా సత్కరిస్తున్నారు. సిఎ అమృత్‌కుమార్ కోట ట్యాక్స్ బార్‌కు అధ్యక్షుడిగా సేవలందించి, పన్నుల చట్టాలు, చార్టర్డ్ అకౌంటెన్సీ రంగంలో తన వృత్తిపరమైన పరిజ్ఞానం, అనుభవం మరియు సేవలతో విశిష్ట గుర్తింపు పొందారు. ఆయనకు లభించిన ఈ పురస్కారం వృత్తిపరమైన రంగంలో ఆయన చేసిన కృషికి లభించిన గౌరవంగా భావించవచ్చు. ఈ ఏడాది చార్టర్డ్ అకౌంటెంట్ విభాగంలో ప్రొఫిషియెన్సీ అవార్డు అందుకోవడం పట్ల అమృత్‌కుమార్ కోటకు సహచరులు, ట్యాక్స్ బార్ సభ్యులు, వృత్తి నిపుణులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐపిఎ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు అమృత్‌కుమార్ కోటను అభినందిస్తూ, ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐపిఎ సన్మాన్ అవార్డు నిర్వాహకులు జె.వి.రావు, డిబి ప్రకాష్, తెలంగాణ, ఎపి ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎపి దహిమా, మాజీ అధ్యక్షుడు సిఎ చంద్రశేఖర్ వేములు, బొజ్జ మధుసూదన్, సెక్రటరీ సిఎ పి.వి.నారాయణరావు, సిఎ కబ్రా తదితరులు కార్యక్రమంలో పాల్గొని అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు

## పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాలి




పిఎస్ఆర్‌కె భగవాన్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 10, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పెంచాలని వడ్డేపల్లి ఎంక్లేవ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిఎస్ఆర్కే భగవాన్ పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా సోమవారం కూకట్‌పల్లిలోని వడ్డేపల్లి ఎంక్లేవ్ ఆవరణలో పీఎస్ఆర్కె భగవాన్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి పలు ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి మొక్కలను నాటి వాటిని పూర్తిస్థాయిలో పెంచడం ద్వారా భావి తరాలకు మనం మార్గదర్శకాన్ని చూపిన వార మవతామని చెప్పారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరు తమ తమ ప్రాంతాలలో మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి ఇంక్లేవ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**దర్బార్ మైసమ్మ తల్లికి వారం మారుబోణం, మూడువారాల సాకలు సమర్పించాలి**



**కార్వాన్ ఆగస్టు10, ప్రభాతవార్త**

మహిమాన్విత సుప్రసిద్ధ కార్వాన్ దర్బార్ మైసమ్మ, మహంకాళిమైసమ్మ ఉమ్మడి దేవాలయాలలో బోనాల మహోత్సవంను పురస్కరించుకుని బోనాల ఉత్సవాలలో చివరి రోజు మధ్యాహ్నం గం.3.30లకు మెరిట్ సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతుల ప్రదానం, సాయంత్రం గం4.లకు పోతురాజు మహంకాళీ దేవాలయం నుండి బయలుదేరి నల్ల పోచమ్మ దేవాలయం వద్ద గావు, గం5.లకు బలిగంప ఊరేగింపు, అతిథుల స్వాగతం, 6గం.లకు ఫలహారపు బండ్లకు స్వాగతం, రాత్రి 11గంలకు అమ్మవారి తొట్టెల నిమర్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**సుశీలమ్మ భవిష్యవాణి..**

భవిష్యవాణి కార్యక్రమంలో సుశీలమ్మ భవిష్యవాణి తెలియజేశారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ తల్లి శాంతించాలంటే మైసమ్మ తల్లికి ఒక్క వారం మారుబోణం, మూడువారాల సాకలు పోసి ఆనంద పరచాలని కోరింది. రాష్ట్రాన్ని, దేశాన్ని రక్షించే బాధ్యత తనపై ఉందని ఆమె తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడిపంటలు బాగాపండే అవకాశం ఉందని తెలిపారు.

## పేద కుటుంబానికి అండగా డా. ఈశ్వరప్ప



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఈశ్వరప్ప

**నిజాంపేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త**

మండలంలోని వెన్నచేడ్ గ్రామానికి చెందిన జంగం శారదమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం గ్రామ బీజేపీ నాయకుల ద్వారా తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు, సేవారత్న అవార్డు గ్రహీత డా. వెన్న ఈశ్వరప్ప వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శారదమ్మ కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి, కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని డా. వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డమీది మల్లయ్య, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చాకలి బాలయ్య, గ్రామ పెద్దలు శివ మల్లప్ప, రామలింగం, ఈశ్వరయ్య, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు రాములు, నరేందర్, బూత్ అధ్యక్షులు వెన్న జ్ఞానేశ్వర్, నాగరాజ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




ఫ్రెషర్స్ డే వేడుకల దృశ్యాలు

## ఘనంగా సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్‌డే

**మూసాపేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త**

కూకట్‌పల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ది అశోక గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల కరె స్పాండెంట్ డా. కె. నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు, ఇతర వినోద కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేలా కార్యక్రమాలను ఉత్సాహభరితంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా డా. కె. నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కళాశాల జీవితంలో మొదటి సంవత్సరం నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, కలలను సాకారం చేసే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.వి. లావణ్య నరేష్, ప్రిన్సిపల్ ఎస్.ఎన్. మీనాంబిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 30న జింఖానా మైదానంలో జిల్లాస్థాయి మాస్టర్స్‌క్రీడా పోటీలు : మర్రి లక్ష్మారెడ్డి, జంపన



మీడియాతో మాట్లాడుతున్న నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, జంపనప్రతాప్

**కంటోన్మెంట్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జిల్లా స్థాయి మాస్టర్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అసోసియేషన్స్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ జంపనప్రతాప్‌లు తెలిపారు. సోమవారం బోయి న్పల్లి సౌజన్య కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో వారు మాట్లాడుతూ 35 సంవత్సరాల నుంచి 100 సంవత్సరాలు వయసులో ఉన్న మాస్టర్స్ క్రీడా పోటీల్లో పాల్గొం టారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడా కారులకు 500 రూపాయలు ఎంట్రీ ఫీజు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వచ్చే నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో ఘనంగా అమ్మవారి తొట్టెల, పలారం బండి ఊరేగింపు



పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్, సాయినగర్, రాజు కాలనీలలో అమ్మవారి తొట్టెలు, గొర్రె పొట్టేళ్ల పలారం బండి ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక బిజెపి నాయకులు అత్తికారి మల్లేష్, నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, బండారి నవీన్ ప్రకాష్ గౌడ్, బాలింగ్ రాము ముదిరాజ్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపుల్లో వివిధ కళాబృందాలు పాల్గొని తమ కళా ప్రదర్శనలతో భక్తులను అలరించాయి. నిర్వాహకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ ఊరేగింపుల్లో పాల్గొని అమ్మవారి దివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి వారి కోరిక మేరకు కొద్దిసేపు డప్పుల చప్పులకు లయబద్ధంగా నృత్యం చేసి యువతలో ఉత్సాహాన్ని నింపారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు ఊరేగింపులో పాల్గొనడంతో నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు నిర్వాహకులను అభినందిస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. అదేవిధంగా పండుగ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంచి మహేందర్ యాదవ్, సతీష్ గౌడ్, సురేందర్ రెడ్డి, రమేష్, డాక్టర్ కిరణ్, శ్రీనివాస్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణ కోసం కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలి



అమృతం వీరాను సత్కరిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** మానవ హక్కుల పరిరక్షణ కోసం హ్యూమన రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా గత నాలుగు సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటూ ప్రజల హక్కుల కోసం పనిచేసిందని కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమృతం వీరా చెప్పారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ జరిగిన కౌన్సిల్ జాతీయ 4వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. రాబోయే రోజుల్లో సంస్థను మరింతగా బలోపేతం చేయడంతోపాటు మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడాలని ఆయన సూచించారు. ప్రతి సభ్యుడు తన బాధ్యతను గుర్తించి క్రమశిక్షణతో, నీతి, నిజాయితీతో పనిచేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని బాధితులకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ముత్యాల బాబు, ఎపి అధ్యక్షుడు ఖారీదాసు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్‌కుమార్ తదితర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గానికి కూన శ్రీశైలం గౌడ్ అభినందనలు

**పేట్ బషీరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త**



శ్రీశైలగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నిజాంపేట్ సర్కిల్ పరిధి లోని బండారి లేఔట్ డివిజన్‌లో ఉన్న పూజిత ఎన్‌క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూత నంగా ఎన్నికైన అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శాలువాతో సత్కరించారు. పూజిత ఎన్‌క్లేవ్ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా నియో జకవర్గ పరిధిలోని పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను కూన శ్రీశైలం గౌడ్‌కు అందజేసి, కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూజిత ఎన్‌క్లేవ్ మాజీ అధ్యక్షుడు శరత్, అమర్, బెనర్జీ, రాజు, నరేంద్ర, వెంకట్ రాజు, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్, శివారెడ్డి, శ్రీనివాసులు, రణధీర్, అరవింద్, యాదగిరి, ఏ.కె. రావు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

**నిజాంపేట్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ విద్యార్థిని ప్రవళిక చదువుకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. దాతలు గారేపల్లి ప్రదీప్, సంగీత దంపతుల కుమారుడు అథర్వ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సహాయాన్ని అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రవళికకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె విద్యకు అండగా నిలవాలని ట్రస్ట్ నిర్ణయించింది.

## అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించాలి

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేసిన టీచర్లకు, ఆయాలకు తక్షణమే పదవి వీరమణ ప్రయోజనాల బకాయిలను చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలలో 65 సంవత్సరాలు నిండిన టీచర్లను, అయాలను పదవి వీరమణ చేసిందని, అయితే వారిలో కొంత మంది టీచర్లకు ఒక లక్ష రూపాయలు, ఆయాలకు 50 వేల రూపాయలు పదవి వీరమణ ప్రయోజనాలు కల్పించి, మిగతా వారిని విస్మరించిందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి ఆరోపించారు. తక్షణమే మిగిలిన వారందరూ పదవి వీరమణ ప్రయోజనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. కా ంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 18 వేల మంది అంగన్‌వాడీ టీచర్ల పోస్టులను భర్తీ చేస్తామని, టీచర్లకు, ఆయాలకు 30 శాతం పిఆర్‌సి వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, సుప్రీంకోర్టు సూచనల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఇండ్లుగాని, ఇళ్ళ స్థలాలను మంజూరు చేయాలని ఆమె కోరారు.

## రాజేశ్వర్‌రావు మృతికి ఎఐటియుసి సంతాపం

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** హైదరాబాద్ బుక్ ఫేర్ వ్యవస్థాపకుల్లో ఒకరు, విశాలాంధ్రపబ్లిషింగ్ మాజీ మేనేజర్ పి.రాజేశ్వర్‌రావు అకాల మృతి పట్ల ఎఐటియుసి రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో రాజేశ్వర్‌రావు చిత్రపటానికి ఎఐటియుసి ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని, రాష్ట్ర ఇన్‌చార్జీ వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, కార్యదర్శులు బి.వెంకటేశం, నందూరి కరుణకుమారి, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి, నగర అధ్యక్షుడు బోడ్డుపల్లి కిషన్ తదితరులు పూలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.




ఘట్‌కేసర్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న సిపిఐ నాయకులు

## బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ ప్రచారం

ఘట్‌కేసర్, ఆగష్టు 10, ప్రభాతవార్త: కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ప్రతిఒక్కరూ నిరసించాలని సీపీఐ జిల్లా నాయకులు కల్లూరి జయచంద్ర పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య రక్షణకై భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్త ఇంటింటి ప్రచారం చేపట్టిందని ఆయన తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో సిపిఐ పార్టీ నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఇంటింటికి కరపత్ర ప్రచారం చేశారు. మండల సిపిఐ కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సయ్యద్‌ఖదీర్‌ల ఆధ్వర్యంలో దుకాణాలు, ఇంటింటి కరపత్రాలను పంపిణీ చేశారు. సెప్టెంబరు 1వ తేదీన తలపెట్టిన ఛలో ఢిల్లీ జంతర్ మంతర్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బద్దంగా భారత రాజ్యాంగం ప్రకారం ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రతి ఒక్కడికి ఉద్యోగం కల్పించాలి మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కార్మికుల హక్కులను పరిరక్షించాలని, ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీసం మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, దళిత ఆదివాసులపై ఆకృత్యాలను దాడులను నిలిపివేయాలని దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు కఠిన శిక్షలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.శ్రీనివాస్, ఎం.రామచంద్రయ్య, ఎం.శంకరయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్ ఆంజనేయులు, సత్యనారాయణ, మున్సిపల్ జిల్లా నాయకులు. ఎం రామచందర్, రామ్ కుమార్, జె.రమేష్, సయ్యద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకం

**సిడ్స్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.60 వేల అందజేత**

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** విద్యార్థులను ప్రోత్సహించేందుకు సిడ్స్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ కృషి చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ అమీర్‌పేట సబిత గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ గ్రామంలో సిడ్స్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు పాడి రైతుల విద్యార్థులకు సిడ్స్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.60 వేల ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షి ంచారు. తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్స హించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాణిక్యం, సిడ్స్ మిల్క్ సంస్థ ప్రతినిధులు వంశీధర్ రెడ్డి, కేశవరావు, భాగ్యశ్రీ, వరలక్షి ్మ, సంతోష్, అమృతరెడ్డి, హేమంత్, గంగాధర్, అవినాష్, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకం



షాబాద్ మండలంలో ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**షాబాద్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**

## ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిరా షాబాద్ లోని ఫామ్‌హౌస్‌లో సోమవారం ఆమె నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాం గ్రెస్ నాయకులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమీర్‌పేట గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది

**కొడంగల్ రూరల్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):** కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య ఆరోపించారు. జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో వివిధ రంగాల కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ పెట్టుబడిదారులు, కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలి: రాంచందర్‌రావు

**తార్నాక, ఆగస్టు 10 ప్రభాతవార్త :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా సోమవారం రాంచందర్‌రావు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజలంతా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద భారీగా తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దేశ ఐక్యత, సమగ్రతను చాటేలా యాత్రను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

## సోనబాయి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకారం : తలసాని



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** సోనబాయి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆషాఢ బోనాల సందర్భంగా సోమవారం సాయంత్రం అమీర్‌పేటలోని సోనబాయి అమ్మవారి ఆలయాన్ని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ రెడ్డి, టి. శ్రీహరి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, పీయూష్ గుప్త, కట్టా బలరాం, సత్యనారాయణ, గులాబ్ సింగ్, ఉత్తమ్ కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 13న 'గ్లోబల్ అద్వైత జ్ఞానోదయ సంఘటన్ '



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివప్రసాద్, ఆనంద్‌రెడ్డి, రేష్మా, ప్రీతి తదితరులు

**హైదరాబాద్ ఆగస్టు 10, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 13న శిల్పకళా వేదికలో గ్లోబల్ అద్వైత జ్ఞానోదయ సంఘటన్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ సమన్వయకర్త శివప్రసాద్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత, అద్వైతంలోని ఆచరాత్మక, హేతుబద్ధ, విశ్వజనీన జ్ఞానాన్ని ప్రపంచానికి అందించడమే లక్ష్యంగా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. భారత దేశంలోని విభిన్న మతాలు అనుసరిస్తున్న ఏకైక మార్గాన్ని తాము బోధిస్తున్నామన్నారు. అద్వైతంలో మానవుని జీవన విధానం ఉందని, దానిని గుర్తించకుండా తామంటేతాము హెచ్చు అంటు కల్లోళిత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. తాము నిర్వహించే జ్ఞానోదయ సంఘటన్ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలనుండి వక్తలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖలతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సైతం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు ఆనంద్ రెడ్డి, రేష్మ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయలకు బోనాలు ప్రతీక : మాజీ మంత్రి తలసాని



కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్ రాకేష్ తివారీ

**చార్మినార్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పాతబస్తీ ఉప్పుగూడలో టిల్లు తల్వార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపును మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని తెలిపారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్, సంఘ సేవకులు రాకేష్ తివారీతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంచు భూమి కూడా పోనివ్వను : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**అత్తాపూర్ ఆగస్టు 10, ప్రభాతవార్త :** దశాబ్దాలుగా నివసిస్తున్న 300 పేద కుటుంబాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండగా నిలిచారు. సోమవారం రాజేంద్రనగర్ హనుమాన్ నగరంలో ఎమ్మెల్సీ మల్లన్న పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా మరియు వారికి వత్తాసు పలుకుతున్న పోలీసుల తీరుపై మల్లన్న తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధితులకు ధైర్యం చెబుతూ, వారి హక్కుల కోసం తాను ఎందాకైనా వెళ్లడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. "కోర్టు ఆర్డర్ గౌరవించకుంటే బోనులో నిలబెడతాం"సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని మల్లన్న గుర్తు చేశారు. అయినప్పటికీ, రాజేంద్రనగర్ పోలీసులు రియల్ ఎస్టేట్ మాఫియా మరియు పక్కనే ఉన్న విల్లా యజమానుల దగ్గర డబ్బులు తీసుకుని, గుండాలతో జతకట్టి పేదలను వేధిస్తున్నారని, పోలీసులే గుండాలను పెట్టి ప్రజలను కొట్టడం, ఇళ్ల నుంచి తరిమేయడం వంటి కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కోర్టు తీర్పును ధిక్కరించి పోలీసులు భూముల్లోకి వస్తే, వారి పేర్లను వీడియో తీసి పెట్టాలని, స్వయంగా తానే వారిపై హైకోర్టులో కేసులు వేయిస్తానని హెచ్చరించారు. గతంలో గౌలిదొడ్డి వద్ద పేదల భూములను కబ్జా చేయడానికి గుండాలు ప్రయత్నించినప్పుడు, తానే స్వయంగా వెళ్లి అక్కడ కట్టిన షీట్లను తన్ని పడేశానని మల్లన్న గుర్తు చేశారు. నేడు అక్కడ పేదలే రాజసం అనుభవిస్తున్నారని, అదే తరహాలో రాజేంద్రనగర్ పేదలకు కూడా న్యాయం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. భూ సమస్యపై సైబరాబాద్ సీపీకి, హోమ్ సెక్రటరీకి మరియు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు అందజేస్తున్నట్లు మల్లన్న తెలిపారు. బాధ్యులైన పోలీసులపై మరియు కబ్జాదారులపై చట్టపరమైన పోరాటం చేస్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు విశ్రమించబోనని తెలిపారు.

## ప్రెసిడెన్సియల్ ఆర్డర్‌ను సమీక్షించి దళిత హోదా కల్పించాలి : బిషప్ భాస్కరయ్య



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బిషప్ భాస్కరయ్య తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** మతం మారినా నేటికీ ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్ష కొనసాగుతోందని, కేంద్రం వెంటనే ప్రెసిడెన్సియల్ ఆర్డర్‌ను సమీక్షించి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని నగర సీఎస్ఐ బిషప్ రెవరెన్ భాస్కరయ్య డిమాండ్ చేశారు. సోమవారం నేషన్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ దళిత్ క్రిస్టియన్స్ తెలంగాణ జాతీయ సమన్వయ కర్త విజయ్ మేల్కొటి అధ్యక్షతన సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందు మతంలో తమకు జరిగిన అన్యాయంతో విసిగి పోయి తమ జీవన విధానం మార్పుకోరే దళితులు క్రైస్తవం తీసుకున్నారని, జీవన మార్పుకోసం మారితే వారికున్న దళిత హోదాను తొలగించడం అన్యాయమన్నారు. కుల పరంగావారు ఏ మతం మారినా కులం యధావిధిగా ఉంటుందని, అటువంటప్పుడు ఆహోదాను తొలగించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చదువు, ఆర్థిక, సామాజిక హోదా మార్పు కోసం మతం మారిన మారిన వారికి ఎస్సీ హోదా తొలగించడం సబబు కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవుల జీవితాల పై అధ్యాయనం చేసి న్యాయబద్ధంగా వారికి ఎస్సీహోదా కల్పించాలని కోరారు. ప్రొ. ప్రభుదాస్ మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన వారి సామాజిక హోదా మారలేదన్న విశయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. దేశాన్ని బిటీష్ వారు పాలించిన కాలంలో సామాజికంగా క్రింది కులాలకు చెందిన వ్యక్తులను చేరదీసి చదువు, వైద్యం వంటి సౌకర్యాలను కల్పించినందున కొందరు క్రైస్తవం పట్ల ఆసక్తులైనారని, అయినంత మాత్రాన వారి సమాజిక హోదా మాత్రం సమాజంలో అలాగే ఉందన్నారు. నేటికీ దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అలాగే ఉనవాయని, ఏ మాత్రం అభివద్ధి చెందలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైన దళిత క్రైస్తవుల పట్ల సానుకూలంగా వ్యవహరించి ఎస్సీ హోదాను కొనసాగించాలని కోరారు. ఈసమావేశంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మంజూ, ఆంటోనీ, నత్తానియేల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణను ఉద్యమంలా చేపట్టాలి



వండర్స్ ఇన్ నేచర్ పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఆగస్టు 10, ప్రభాతవార్త :** ప్రకృతి ప్రేమికులైన మానవులు పర్యావరణానికి దూరం కావడం వల్లే నేడు దాని కోపాన్ని అనుభవించాల్సి వస్తోందని సినీ రచయిత, దర్శకుడు, సామాజిక కార్యకర్త రాజ్ మాదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ రక్షణను ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం నేచర్ టు ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాజ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ జర్నలిస్ట్ తుర్లపాటి నాగభూషణ రావు రచించిన వండర్స్ ఇన్ నేచర్ (ఆంగ్ల గ్రంథం) ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజ్ మాదిరాజ్ మాట్లాడుతూ ప్రకృతి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని, ఇంట్లో ఒక చిన్న మొక్క నాటి బాధ్యత తీరిపోయిందనుకోవడం సరికాదన్నారు. పర్యావరణ విపత్తులు రాకముందే అందరూ చైతన్యవంతులు కావాలన్నారు. రాష్ట్ర ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) టి. మానస మాట్లాడుతూ మానవ నాగరికత అడవి సంపద వినియోగంతోనే ప్రారంభమైందని, మన సంస్కృతి, ఆధ్యాత్మికత ప్రకృతితో మమేకమై ఉన్నాయని గుర్తుచేశారు. తుర్లపాటి నాగభూషణ రావు రచించిన ఈ గ్రంథాన్ని చిన్నారులు టి. విరాజ్, టి. విహాన్, బి. శ్యామృత్, కె. గాయత్రి అనంత స్మృతి తదితరులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ కానూరి సత్యనారాయణ, డాక్టర్ సీతాలక్ష్మిలకు రచయిత అంకితం ఇచ్చారు. చెన్నైకి చెందిన కిదాంబి లక్ష్మీకాంత్ బృందం నిర్వహించిన నాదనీరాజనం శాస్త్రీయ సంగీత కచేరీ, చిన్నారి స్మృతి నాట్య ప్రదర్శన, భోగరాజు శ్యామృత్ వేసిన పోతరాజు వేషధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి పి. ఇందిరాదేవి, పోణంగి బాలభాస్కర్, శేషభట్టర్ మురళి వేంకటాచారి, వివిఎన్ విజయకుమార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

## సమాజమార్పు కోసం అహర్నిశలు కృషిచేసే అరుదైన కవి నందిని సిధారెడ్డి : సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సదస్సులో ప్రసంగిస్తున్న నిరంజన్‌రెడ్డి, జయప్రకాష్, సిధారెడ్డి, నరసింహారెడ్డి, నాళేశ్వరంశంకరం, మృణాళిని తదితర అతిథులు

**నాంపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** సమసమాజం కోసం అహర్నిశలు ఎంతో ఓపిక పట్టుదలతో కృషిచేసే అరుదైన కవి డా. నందిని సిధారెడ్డి అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, టీజీఎస్‌డబ్ల్యుఆర్ మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్ర హిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సమితి ప్రధాన సంపాదకుడు డా. జయప్రకాష్ అధ్యక్షతన బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విశిష్ట అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఎన్. బాలాచారి, డా. మృణాళిని, డా. నందిని సిధారెడ్డి, ఆచార్య కొండ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు తదితరులతో కలిసి డా. నందిని సిధారెడ్డి సాహిత్య సమాలోచన వ్యాసం సంకలన గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. సిధారెడ్డి 2001లో తన సాహిత్య తత్వానికి విరుద్ధంగా ఉన్న ప్రభుత్వ పురస్కారాలను తిరస్కరించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. కర్తృత్వం, వక్తృత్వం, నేతృత్వం సమన్వయించిన కవి సిధారెడ్డిని అభినవ పోతన అని అభివర్ణించడంలో అతిశయోక్తి లేదన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ నా ధైర్యం, స్థైర్యం, నా ఊరు బందారం అయితే నా బలం నా సాహిత్యమేనని స్పష్టం చేశారు. తన సాహిత్యంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించి సమారు 800 పేజీల బృహత్ గ్రంథంగా వెలువరించిన తెలుగు భాషా చైతన్య సమితి, మహిళా డిగ్రీ కళాశాల డా. జయప్రకాష్, బడేసాబ్, శ్రీభాష్యం అనురాధ, డా. ఎడ్ల కల్లేశ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ విషయాన్ని కొత్తకోణంలో దర్శించే సిధారెడ్డి ప్రత్యేకతని, పేదలపక్షాన నిలిచే ఆయన కవిత్వం చిరస్థాయిగా నిలుస్తుందని ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. అనంతరం ఇతర అతిథులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ సాహిత్య సదస్సులో 117 మంది రచయితలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.

## వైభవంగా అమ్మవారికి బోనం సమర్పణ



బోనాల ఉత్సవాలో పాల్గొన్న భక్తులు

**సికింద్రాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం సికింద్రాబాద్ న్యూ బోయగూడా మెట్రో పిల్లర్ నెంబర్ 1305, స్టెర్లింగ్ మిస్టిక్ అపార్ట్మెంట్ వద్ద రైల్వే స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారి పై ఉన్న శాంతం దుర్గ మాట అమ్మవారి ఆలయ చైర్మన్ ఠాకూర్ హరినాథ్ సింగ్, నందు సింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా డప్పు చప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలతో తొట్టెల ఊరేగింపుతో కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం, ఒడిబియ్యం, తొట్టేలు కట్టి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ఠాకూర్ హరినాథ్ సింగ్ మాట్లాడుతూ 1998 లో స్థాపించిన ఈ శాంతి దుర్గ మాత అమ్మ వారు ఎంతో మహిమగల దేవత అని చిన్న గుడిగా వెలిసిన ఈ ఆలయం అంచలం చలుగా భక్తుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ బోనాల జాతర ఉత్సవాలలో ఆలయ కమిటీ చైర్మన్ కుటుంబ సభ్యులు హరిత సింగ్, హర్ష, వినయ్ ఠాకూర్ సింగ్, శ్యామ్ సుందర్ సింగ్, బిజెపి గుండు కృష్ణ, కర్ణాకర్ నాయుడు తో పాటు ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, యాదగిరి, కేశవులు, సందీప్, జగ్గయ్య, కృష్ణ, శ్యామ్, గోపాల్, నీలకంఠ కాలనీవాసులు స్థానికులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలి



తార్నాకలోని తన నివాసంలో జెండాను ఆవిష్కరిస్తున్న రాంచందర్‌రావు

**తార్నాక, ఆగస్టు 10 ప్రభాతవార్త :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా సోమవారం రాంచందర్‌రావు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజలంతా స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద భారీగా తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు పార్టీలకతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దేశ ఐక్యత, సమగ్రతను చాటేలా యాత్రను నిర్వహి స్తున్నా మని పేర్కొన్నారు.

## 13న కలెక్టరేట్ల వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నాలు



ఎస్ఎఫ్ఐ ధర్నాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఆగస్టు 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీలు, మెమోలు, ఇతర విద్యా పత్రాలను నిలిపివేసి వేధిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్లతో ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.మమత, డి.కిరణ్, కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు లెనిన్, హైదరాబాద్ జిల్లా నాయకులు ప్రశాంత్, శ్రీరామ్‌తో కలిసి టి.నాగరాజు ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు అందలేదని విమర్శించారు.

## ఫోన్‌పే క్రెడిట్ పేరుతో రూ.7 వేల మోసం

**జూబ్లీహిల్స్ ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఫోన్‌పేలో నగదు జమ అయినట్లు నకిలీ ధ్రువీకరణ చూపించి ఓ వ్యక్తి నుంచి రూ.7 వేలు తీసుకుని మోసం చేసిన ఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 87లోని రవిక స్టూడియో సమీపంలో నివసించే కృష్ణప్రసాద్ (28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం సినీనటుడు మోహన్ బాబు ఇంటి సమీపం లోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు రూ.7 వేలు డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఖాతాకు నగదు బదిలీ చేస్తా నంటూ నమ్మించాడు. అనంతరం ఫోన్‌పేలో రూ.7 వేలు క్రెడిట్ అయినట్లు నకిలీ ధ్రువీకరణ చూపించి నగదును తీసుకున్నాడు. అయితే కొద్దిసేపటి తర్వాత కృష్ణప్రసాద్ తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా నగదు జమ కాలేదని గుర్తించాడు. దీంతో మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేశ వ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలి

-బెంగుళూరులో ఓబిసి మహాసభ అమోదించిన తీర్మానం



తీర్మానాల పత్రులను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, గణేషాచారి తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా జరిగే జనగణనలో బిసి కుల గణన చేపట్టాలని ఇటీవల కర్ణాటక రా ష్ట్రంలోని బెంగుళూరులో జరిగిన ఓబిసి మహాసభ తీర్మానించింది. ఈ మేరకు సోమవారం బిసి కార్యాలయంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఓబిసి మహాసభలో ఆమోదించిన పలు తీర్మానాలను పత్రులను ఆవిష్కరించి మీడియాకు వెల్లడించారు. జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బిసిలకు రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని, ఆ తరువాతే మహిళా బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని, చట్టసభలలో జనాభా దామాషా ప్రకారం బిసిలకు రాజకీయ రిజర్వేషన్‌లు కేటాయించాలని, బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో బిసి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేయాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో బిసి, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలని, దేశవ్యాప్తంగా సామాజిక రిజర్వేషన్‌లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి, బిసిలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పై డిమాండ్ల సాధన కోసం వచ్చే నవంబరులో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో లక్ష మంది బిసిలతో 'చలో పార్లమెంట్' చేపడతామని, ఈ లోగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ఎపి నుంచి యుపి వరకు, గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, బిసిలను సామాజికంగా, రాజకీయంగా చైతన్యవంతం చేయడానికి దేశవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడతామన్నారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, కుందారం గణేషాచారి పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రాజ్యాంగ హక్కు



బోరబండ సెట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చ్‌లో 1950 జీవో రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న జూబ్లీహిల్స్ క్రిష్టియన్ ఫోరమ్ సభ్యులు.

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** మతం మారినంత మాత్రాన కులం మారదని ఏ దేవుడినైనా విశ్వసించే హక్కును రాజ్యాంగం కల్పించిందని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా లేకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందని జూబ్లీహిల్స్ క్రిష్టియన్ ఫోరమ్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని బోరబండ సైట్2లో సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చ్‌లో ఫాదర్ మైకెల్ జోష్, కోపాస్టర్ అండ్ కౌన్సిల్‌మెంబర్స్ బోరబండ ఫాస్టర్ ఫెలోషిప్ ఫౌండర్ బిషప్ పాస్టర్ జోసఫ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకై నల్ల బ్యాడ్జీలను ధరించి ప్లకార్డులతో నిరసన తెలియజేయడం జరిగింది. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వచ్చే వరకు ఈ పోరాటం ఆగదని ఇందుకోసం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకుని పోతామన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా లేకపోతే తీవ్ర అన్యాయం జరుగుతుందని రిజర్వేషన్ లేకుంటే దళిత క్రైస్తవులు ఇంకా వెనుకబాటుకు గురవుతారని అదేవిధంగా జీవో 1950 నాటి రాష్ట్రపతి షెడ్యూల్ కులాల ఉత్తర్వులోని హిందూ, సిక్కు, బౌద్ధమతాలు ఆచరించే దళితులకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేసిందన్నారు. వెంటనే సవరణ చేపట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు ఆర్టికల్ 14, 15 మత స్వేచ్ఛ హక్కు, ఆర్టికల్ 25 అసలు ఉద్దేశాన్ని దెబ్బతీసే విధంగా కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. ఇదే విషయాన్ని గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి దళిత క్రైస్తవులకు అన్యాయం జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దానికి అనుగుణంగానే ఈనెల 9న బీఆర్ఎస్ పార్టీ బృందాన్ని ఢిల్లీకి పంపించి కేజీ బాలకృష్ణ కమిషన్ ముందు పార్టీ తరపున దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించడం జరిగిందని పేర్కొన్నారు.

## కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



కార్మికులతో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ఎంటిఏఆర్ కంపెనీ యాజమాన్యంతో చర్చించి కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. బాలానగర్‌లోని ఎంటిఏఆర్ టెక్నాలజీస్ ఎయిర్ స్పేస్ కంపెనీలో కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హాజరై కార్మికులకు మద్దతు తెలిపి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎంటిఏఆర్ కంపెనీ యాజమాన్యంతో చర్చించి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు.

## వైభవంగా నల్ల పోచమ్మ దేవాలయం ఘటం ఊరేగింపు



అమ్మ వారి ఘటం ఊరేగింపులో పాల్గొన్న దేవాలయం కమిటి అధ్యక్షులు ఆదర్ల మహేష్, కమిటి ప్రతినిధులు

**చార్మినార్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఆషాఢ మాస బోనాల జాతర అమ్మ వారి సామూహిక ఘటాల నిమజ్జనోత్సవం ఊరేగింపు సందర్భంగా సోమవారం గౌలిపుర శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం అమ్మ వారి ఘటం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ నల్ల పోచమ్మ మందిరం నుంచి ప్రారంభమైన అమ్మ వారి ఘటం ఊరేగింపు పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం నయాపూల్ ఢిల్లీ దర్వాజ వరకు కొనసాగిందని మందిరం కమిటి చైర్మన్ ఆదర్ల మహేష్ తెలిపారు. కార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో కార్తీక్ రెడ్డి



**అత్తాపూర్ ఆగస్టు 10, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల వేడుకలు కాటేదాన్, మైలార్దేవపల్లి డివిజన్లలో అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అతిథిగా కాటేదాన్ మైలార్దేవ్ పల్లి డివిజన్ల పరిధిలో సుడిగాలి పర్యటనతో పలు ప్రముఖ దేవాలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఫలహారం బండి కార్యక్రమాలు మరియు ఆధ్యాత్మికంగా సాగిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో కార్తీక్ రెడ్డి స్వయంగా పాల్గొని, భక్తులతో కలిసి ఆనందోత్సాహాలను పంచుకున్నారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ మట్టి వాసన, మన భక్తి శ్రద్ధలు ప్రతిబింబించే పండుగ బోనాలు. ఆ జగన్మాత ఆశీస్సులతో మన ప్రాంత ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు. మన సాంప్రదాయాలను, ఐక్యతను కాపాడుకుంటూ వేడుకలను వైభవంగా నిర్వహించిన నిర్వాహకులకు, పాల్గొన్న భక్తులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ రిచ్ కిడ్స్ కేసులో ఇద్దరి అరెస్ట్

**జూబ్లీహిల్స్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన రిచ్ కిడ్స్ కేసులో సిట్ అధికారులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు చంద్రశేఖర ఆజాద్ తల్లి కోడూరి మీనాకుమారి(41), ఆమె కుటుంబ స్నేహితుడైన వినీల్ చౌదరి అలియాస్ వినీల్ బాబు(38)లను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో భాగంగా మొత్తం 11 మంది పోలీసులు కేసులు నమోదు చేయగా అందులో ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు చంద్రశేఖరాజాద్‌తోపాటు అతని సోదరుడు, స్నేహితుడు, తల్లి, మేనమామ తదితరులు అరెస్ట్ అయ్యారు. అయితే ఈ కేసులో మీనాకుమారి, వినీల్‌చౌదరికి బెయిలు రావడంతో పోలీసులు మరోమారు కోర్టును ఆశ్రయిచారు. దీంతో కోర్టు వారిని అరెస్ట్ చేయడానికి అనుమతిచ్చింది. ఈ క్రమంలోనే సిట్ బృందం వారిని పట్టుకోవడానికి ఢిల్లీ తదితర ప్రాంతాల్లో దర్యాప్తు కొనసాగించింది. గత వారం రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న మీనాకుమారి, వినీల్‌చౌదరిని సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో బీఎన్ఎస్‌లోని 64(2)(ఎం), 308(2), 45, 61, 3(4) సెక్షన్లతో పాటు పోక్సో చట్టం, రెడ్‌విత్ 6, 16 రెడ్‌విత్ 17 సెక్షన్ల కింద కేసు నమోదై ఉంది. అరెస్ట్ అయిన వీరిద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు వారిని కస్టడీకి కోరే అవకాశాలు ఉన్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు.

## ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదం

నలుగురికి గాయాలు.. రెండు కార్లు ధ్వంసం

**సరూర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ఓ కారు డ్రైవర్ రోడ్డుపై వేగంగా వెళ్తూ ముందున్న కారును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎదురుగా వచ్చిన కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. అదే విధంగా రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ సుధాకర్ కథనం ప్రకారం సైదాబాద్ ఇంద్రప్రస్థ నగర్ కాలనీకి చెందిన ఎ.రాకేష్ (24) అనే యువకుడు ఆదివారం సాయంత్రం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్హాపూర్ అమరగిరి నుండి టిజి 32 బిబి 1188 నెంబర్ గల కారులో తన ముగ్గురు స్నేహితులతో కలిసి బయలుదేరాడు. అయితే రాత్రి 9 గంటల సమయంలో బాలాపూర్ ఎయిరో సిటీ వద్దకు రాగా అదే సమయంలో ఎదురుగా టిఎస్ 07 ఇకె 1847 నెంబర్ గల కారు డ్రైవర్ ఓ కారును ఓవర్ టేక్ చేస్తూ వీరి కారును ఢీకొట్టాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాకేష్‌తో పాటు స్నేహితులు గణేష్, చరణ్, చంద్రలకు స్వల్ప గాయాలయ్యారు. ఈ ప్రమాదంలో కార్లు ధ్వంసం అయ్యాయి. ఈ మేరకు రాకేష్ ఫిర్యాదు చేయడంతో ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై నిర్లక్ష్య డ్రైవింగ్‌గా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంజాగుట్ట స్మశానవాటికలో శిశువు మృతదేహం మాయం!

**జూబ్లీహిల్స్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** పంజాగుట్ట హిందూ స్మశానవాటికలో పాతిపెట్టిన శిశువు మృతదేహం కనిపించకపోవడం కలకలం రేపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోల్‌కతాకు చెందిన రాజు మండల్, పూజ దంపతులకు నాలుగు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో కవల లు జన్మించారు. ఆరు నెలలకే ప్రసవం కావడంతో ఇద్దరు శిశువులను ఎన్ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆదివారం తెల్లవారుజామున ఒక శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పంజాగుట్ట స్మశాన వాటికకు తీసుకెళ్లి ఖననం చేశారు. సోమవారం తెల్లవా రుజామున రెండో శిశువు కూడా మృతి చెందడంతో దాని మృతదేహాన్ని అదే స్మశానవాటికకు తీసుకువచ్చారు. అయితే ముందుగా ఖననం చేసిన శిశువు సమాధి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వారు సిబ్బందిని ప్రశ్నించగా తమకేమీ తెలియదని చెప్పినట్లు ఆరోపించారు. అనంతరం సమాధి చేసిన ప్రదేశంలో తవ్వి చూడగా శిశువు మృతదేహం కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు సిబ్బందితో వాగ్వాదానికి దిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్మశానవాటికలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మృతదేహం ఎలా మాయమైంది, ఎవరు తీసుకెళ్లారు, స్మశాన వాటిక సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.